క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



బిజినేపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వేంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం బిజినేపల్లి పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కార్మికులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్మికులు సాయి, మోహనయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, శ్రీశైలం, మశన్న, కొండయ్య, కుర్మయ్య, రామేశ్వరమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఆలయంలో హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా దేవాలయంలో 15 రోజుల పాటు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. మొత్తం రూ.1.63 లక్షలు కానుకలు వచ్చినట్లు ఈఓ ప్రసాద్ తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణదారి, ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి పర్యవేక్షించారు. వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, శివకుమార్ శర్మ, నరహరిశర్మ, సంతోష్‌శర్మ, సురేష్‌శర్మ, కమిటీ సభ్యులు మల్లేష్‌ముదిరాజ్, అంజయ్య, పర్వత్‌రెడ్డి, కానిస్టేబుల్ నవీన్‌కుమార్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వహణపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని అవుసలికుంట, కొత్తచెర్వుతండాలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలకు సంబంధించిన పలు రికార్డులను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రతి రోజు విద్యార్థికి రాగి జావాను ఇవ్వాలను ఆదేశించారు. అపార్ ఐడీని జనరేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేద్దాం

తెలకపల్లి: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేద్దామని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో కైలాస చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బాలగౌడ్, కోనేరు సంస్థ కమ్యూనిటీ మొబిలైజర్ రజిత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ మహిళ, పంచాయతీ కార్యదర్శి సుమలత, ఆశా కార్యకర్త జయమ్మ, శ్రీలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కల్వకుర్తి టౌన్: బస్సులో ఫోన్ మరిచిపోయిన ప్రయాణికుడికి బుధవారం అప్పగించారు. నల్గొండ జిల్లా మల్లేపల్లికి చెందిన కిరణ్ తన స్నేహితులతో కలిసి జడ్చర్ల నుంచి కల్వకుర్తి వరకు కల్వకుర్తి డిపో బస్సులో ప్రయాణించాడు. కల్వకుర్తిలో ఫోన్‌ను మరిచి బస్సు దిగి వెళ్లాడు. మల్లేపల్లికి వెళ్లేందుకు వేరే బస్సు ఎక్కి చూసుకునే సరికి ఫోన్ లేకపోవటంతో ఇతరుల ఫోన్ ద్వారా అతని నంబర్‌కు చేశాడు. కండక్టర్ ఫోన్ ఎత్తి వివరాలు తెలుసుకొని కంట్రోలర్ రూం వద్దకు రావాలని సూచించాడు. కంట్రోలర్ వద్దకు రాగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాధితుడికి ఫోన్ అందజేశాడు. ఫోన్ విలువ రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను డిపో మేనేజర్ సుభాషిణితో పాటుగా డిపో ఉద్యోగులు అభినందించారు.

ఇంటింటి సర్వే

వంగూరు: మండలంలోని రంగాపూర్‌లో నెలకొన్న పలు సమస్యలను గుర్తించేందుకు బుధవారం సీపీఎం నాయకులు పర్యటించారు. 8, 9, 11 వార్డుల్లో ఇంటింటికి తిరిగి సమస్యలను గుర్తించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, రాములుగౌడ్, చింతా సత్యనారాయణ, శ్రీను, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలో సివిల్‌సప్లయ్ గోదాం

• బియ్యం నిల్వకు ఇబ్బందులు



అద్దె భవనంలో కొనసాగుతున్న సివిల్‌సప్లయ్ గోదాం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సివిల్‌సప్లయ్ గోదాంకు సొంత భవనంలేక అద్దె భవనంలో కొనసాగుతోంది. బియ్యం నిల్వ చేసేందుకు సరిపడ గోదాం లేకపోవడంతో ప్రతినెల రేషన్ బియ్యం సరఫరాలో జాప్యం జరుగుతోంది. సివిల్ సివిల్‌సప్లయ్ నిర్మాణం కోసం 2006వ సంవత్సరంలో రూ.1.75 కోట్ల నిధుల మంజూరయ్యాయి. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం గుర్తించకపోవడంతో నిధుల వెనక్కి వెళ్లిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో 2018లో శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకంలో సివిల్‌సప్లయ్ నిర్మాణం కోసం రూ.3 కోట్ల నిధులను అప్పటి, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు నిధులు మంజూరు చేయించారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించకపోవడంతో రూ.3 కోట్ల నిధులు కూడా వెనక్కి వెళ్లాయి. పెద్దకొత్తపల్లి సివిల్‌సప్లయ్ గోదాంకు ప్రతినెల 32 టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. ప్రస్తుతం ఉన్న గోదాంలో 15 టన్నుల బియ్యం మాత్రమే స్టాక్ చేసేకునేందుకు అవకాశం ఉంది. 15 టన్నుల బియ్యాన్ని డైరెక్ట్‌గా జడ్చర్ల నుంచి లారీలో వచ్చిన బియ్యాన్ని నేరుగా రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు. దీంతో ప్రతి నెల 15 రోజులు ఆలస్యం అవుతోంది. మండలంలో 28 రేషన్‌దుకాణాలకు గాను మొత్తం 48,505 రేషన్ కార్డు దారులు ఉన్నారు. కోడేరు మండలంలోని 9 రేషన్‌దుకాణాలకు పెద్దకొత్తపల్లి సివిల్‌సప్లయ్ గోదాం నుంచే బియ్యం సరఫరా అవుతున్నాయి.

సొంత భవనం నిర్మించాలి



మండల కేంద్రంలో సివిల్‌సప్లయ్ గోదాం నిర్మించాలి. ప్రతినెల బియ్యం ఆలస్యంగా ఇస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధులు వెనక్కి వెళ్లాయి. ఇప్పటికైనా అధికారులు గోదాం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– బొక్కలయ్య, పెద్దకొత్తపల్లి

ప్రభుత్వ స్థలాన్ని గుర్తిస్తాం



మండల కేంద్రంలో సివిల్‌సప్లయ్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి గుర్తిస్తాం. నిధుల మంజూరు కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే గోదాం నిర్మాణం చేపడుతాం.

– ఎండీ రావుఫ్, సివిల్‌సప్లయ్ అధికారి

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో నిర్వహిస్తున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. హోమాలు, పూర్ణాహుతి, దేవతాహ్వానం, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి దేవతాహ్వానము, బేరి పూజ, హంసవాహన సేవ కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ కమిటీ చైర్మన్ వేముల నర్సింహరావు, పాలక మండలి సభ్యురాలు స్వరూప, ఈఓ నర్సింహులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, వరుదరాజులు అయ్యంగార్, వెంకటాచార్యులు, ఆలయ సిబ్బంది రాజు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 10:16 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

'అర్హులను గుర్తిస్తున్నాం'

తిమ్మాజిపేట: మండలంలోని ఆయా గ్రామాలలో క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండలంలోని ఇప్పలపల్లిలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను పరిశీలించారు. అర్హులైన వారిని గుర్తించి ముగ్గులు వేయించారు. బుధవారం ఏడు ఇళ్లకు సంబంధించి స్థలాలను శుభ్రం చేయించారు. రెండు ఇళ్ల నిర్మాణాలకు మార్క్ చేశారు. మండలంలో నాలుగు ఇళ్లకు మార్క్ చేసి జిల్లా అధికారులకు యాప్‌లో నివేదించినట్లు ఆమె పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించేందుకు చైర్మన్ సుముఖత

కల్వకుర్తి రూరల్: పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు ఈ నెల 31వ తేదీ లోగా విడుదల చేసేందుకు విజయ డెయిరీ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కిషోర్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో చైర్మన్ కార్యాలయంలో రైతు సంఘం నాయకులతో చర్చలు నిర్వహించినట్లు వివరించారు. మార్కెటింగ్ లో పాల రైతులను భాగస్వామ్యం చేయాలని, ప్రతినెల మార్కెటింగ్ ఏజెంట్ల పనితీరుపై సమీక్ష చేయాలని, కొత్త ఏజెంట్లను నియమించుకోవాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతు సంఘం ప్రతినిధులు వెంకటరెడ్డి, కాజా భాషా రఘుమారెడ్డి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం



వెల్దండ: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందుతుందని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన బాలిక వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం భోజనం, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్ కృష్ణవేణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేసవిలో కూలీలు జాగ్రత్తలు పాటించాలి

వెల్దండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. బుధవారం తిమ్మినోనిపల్లిలో ఏపీఓ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6గంటల నుంచి 12గంటల లోపు పనులు ముగించుకోవాలన్నారు. అనంతరం పనులను, రికార్డులను పరిశీలించారు.



పోరాటాలతోనే హక్కుల సాధన



నాగర్‌కర్నూల్‌రూరల్: పోరాటాలతోనే మహిళల హక్కులు సాధ్యమని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత అన్నారు. బుధవారం ఐద్వా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ 1981 మార్చి 10న చెన్నైలో ఐద్వా మహిళా సంఘం ఏర్పడిందని అన్నారు. సమానత్వం కోసం నిరంతరం పోరాడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరమ్మ, మనెమ్మ, సుజాత, సుశీల, మంజుల, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వంగూరు: ఉపాధికూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉప్పల్‌పహాడ్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోజుకు రూ.600 చొప్పున 200 పనిదినాలు కల్పించాలని కోరారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

ఉప్పునుంతల: పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో మాజీ సర్పంచులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడంతో బుధవారం మండలంలోని మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకొని ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం వారిని స్వంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కాముడి దహనం



కల్వకుర్తిరూరల్: హోలీ పండుగ సందర్భంగా పట్టణంలోని హనుమాన్ దేవాలయం వద్ద బుధవారం రాత్రి కాముడి ప్రతిమను దహనం చేశారు. యువకులు కేరింతలు కొట్టారు. గ్రామస్తులు పండుగ విశిష్టతను వివరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తిమ్మాజిపేట: మండలంలోని బాజీపూర్‌లో బుధవారం రూ.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కూచుకుళ్ల రామేశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, అల్వాల శివ, బాలయ్య, మల్లేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోండి

కోడేరు: జిల్లాలో ఉన్న 10వ తరగతి చదివిన విద్యార్థులు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆర్మీ అగ్నివీర్‌కు దరఖాస్తులు చేసుకోవాలని యూకే డిఫెన్స్ అకాడమీ కోచింగ్ డైరెక్టర్ తుమ్మల చంద్రయ్య, ట్రైనర్ లింగస్వామి తెలిపారు. గురువారం నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్: 7036991978 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

జాబ్ కార్డుదారులందరికీ పని కల్పిస్తాం

లింగాల: జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి కూలీకి ఉపాధి హామీ పని కల్పిస్తామని పంచాయతీ కార్యదర్శి లలిత పేర్కొన్నారు. మండలంలోని సూరాపూర్ గ్రామ పంచాయతీ శివారులో అమలవుతున్న జంగిల్ కటింగ్ పనులను కార్యదర్శితో పాటు ఇతర అధికారులు బుధవారం ఆమె పరిశీలించారు. ప్రాధాన్యత కలిగిన పనులను మొదటగా చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, కూలీలు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం

బిజినేపల్లి: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన పానుగంటి కృష్ణ సోషల్ మీడియాలో తనకు ఇప్పటికీ పింఛన్ అమలు కాలేదని దీంతో ఇబ్బంది పడుతున్నానని ఒక వీడియోను పోస్ట్ చేశాడు. దీనిని గమనించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్పందించి ఎంజేఆర్ ట్రస్టు ద్వారా ప్రతి నెలా రూ.4000 ఇచ్చేందుకు ముందుకువచ్చాడు. మొదటి నెలకు గాను బుధవారం కార్యకర్తల ద్వారా రూ.4 వేలు అందించాడు.

వాల్‌పోస్టర్ల విడుదల

పెద్దకొత్తపల్లి: ఈ నెల 15వ తేదీన ఖమ్మం జిల్లాలోని నెలకొండపల్లిలో భీమ్‌దీక్ష ప్రారంభ సభ నిర్వహిస్తునట్లు జిల్లా స్వేరోస్ కోశాధికారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో భీమ్ దీక్ష వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి శివశంకర్, చింటు, సంపత్‌కుమార్, కాశయ్య, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

రెండోరోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గూట విజయ్ మాట్లాడుతూ వర్గీకరణ తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మంగి విజయ్, యాకోబు, శ్రీశైలం, వెంకటయ్య, చంద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా లోని పలు మండలాల్లో బుధవారం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు ధర్నాలు, నిరసనలు తెలిపారు. కొల్లాపూర్‌లో సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. బల్మూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ పాల్గొన్నారు. తాడూరు మండలంలోని గుంతకోడూరులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి కాశన్న హాజరయ్యారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు

నాగర్‌కర్నూల్: ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై 25 శాతం రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్స్, ఎల్టిపీస్, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ అనాథరైజ్డ్ లేఅవుట్లలోని ప్లాట్ల అనాథరైజ్డ్ లేఅవుట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020లో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మార్చి 31, 2025 లోగా క్రమబద్ధీకరించి ఫీజు చెల్లించిన వారికి 25% రాయితీ లభిస్తుందన్నారు. సబ్ రిజిస్ట్రార్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వికాస్‌తో పాటు, ఎల్‌టీపీలు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి నిధులు కేటాయించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో యువజన క్రీడా రంగానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు ప్రభుత్వం ప్రతి ఒక్కరికి రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో స్టేడియాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్రీడారంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరారు. శివవర్మ, శివశంకర్, నాగపూర్ మధు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కొల్లాపూర్: యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఓఎస్‌డీ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ మాట్లాడుతూ నిరుద్యోగులందరికీ భృతి చెల్లించాలన్నారు. జాబ్ కార్డును అమలు చేయాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని కోరారు. యూత్ రూరల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర వరప్రసాద్, నాయకులు సాయికుమార్, రాజ్‌కుమార్, సంజు, భాష తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకారుపాముల గ్రామానికి చెందిన అంకాని రాములు(36) ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఈ నెల 2న గ్రామంలోని రోడ్డుపై రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అంకాని రాములు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండి గోవింద్(50) మంగళవారం ఇంటి ముందు అన్నం తింటూ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు సిద్ధార్థ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

గొర్రె పిల్లలపై కుక్కల దాడి

తిమ్మాజిపేట: మండలంలోని బుద్దసముద్రంలో బుధవారం గ్రామ సమీపంలో నర్ల నరేష్ సంబంధించిన గొర్రెలపై కుక్కలు దాడి చేశాయి. పది గొర్రెపిల్లలపై దాడి చేసినట్లు కాపరి నరేష్ వాపోయాడు. ఇటీవల మండలంలోని నేరళ్లపల్లిలో వారం రోజుల కిందట బెస్త శివ, శేఖర్, వెంకటయ్య అనే రైతులకు చెందిన అయిదు గేదె దూడలను కుక్కలు కరిచాయి. అదే గ్రామంలో రెండు గొర్రె పిల్లలను కుక్కలు దాడి చేసి చంపివేసిన విషయం విధితమే. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి గొర్రె పిల్లలను కాపాడాలని పలువురు గొర్రెల కాపరులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి మండల కేంద్రం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పాటు రాత్రి వేళ అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుపడిన అదుపులోకి తీసుకొని ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న దీక్ష

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీ శివారులోని 17వ వార్డులో దారికి అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని బీసీకాలనీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. కాలనీలో తాగేందుకు నీళ్లు కూడా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, తిరుపతయ్య, వెంకటయ్య, నిరంజన్, ఈశ్వరమ్మ, కాశమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు, ఆర్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడికిల్ల పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ

చారకొండ: గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీఓ లక్ష్మయ్య అన్నారు. మండలంలోని జేపల్లి, గోకారం, ఎర్రవల్లిలో బుధవారం నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎర్రవల్లిలో పూర్తి స్థాయిలో మొక్కలు మొలకెత్తకపోవడాన్ని గుర్తించారు. గ్రీన్‌టెంట్ ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

స్పౌజ్ బదిలీల అక్రమాలపై విచారణ చేపట్టాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ ద్వారా గత నెలలో జరిగిన స్పౌజ్ బదిలీలలో అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ జరపాలని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్ బాబు డిమాండ్ చేశారు. తిమ్మాజిపేట మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయురాలు స్పౌజ్ కేటగిరిలో తన భర్తలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యోగం చేస్తున్నారని తప్పుడు ధ్రువపత్రాలు చూపించి మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారని ఆరోపించారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం డీఈఓ రమేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బంజార గిరిజన విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు సంతోష్‌నాయక్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శివకుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ ఉన్నారు.

హమాలీ కార్మికుల సమస్యలపై అధ్యయనం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో బుధవారం కార్మికుల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు అధ్యయనం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈజీఎస్ పనులు ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈజీఎస్ జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నవారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. జహంగీర్, తిరుపతయ్య, బాలయ్య, సైదులు, నీరంజన్, బాలకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పెద్దకొత్తపల్లి: మండలంలోని కొత్తయాపట్ల పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. చక్కగా పాఠాలు బోధించిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రత్యుష, గౌరమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు

తెలకపల్లి: మండలకేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో, సిద్ధార్థ మోడల్ పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయలో 'మాక్' పార్లమెంట్



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

బిజినేపల్లి: మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బాల సంసాద్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మాక్ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించారు. నవోదయ విద్యాలయంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు పార్లమెంట్‌లో సన్నివేశాలను కళ్లకు కట్టినట్లు వేష భాషలతో, మాటలతో, భావ వ్యక్తీకరణతో ఆహుతులను ఆకట్టుకున్నారు. నూతన సభ్యుల ప్రమాణస్వీకారం, నూతన మంత్రుల ప్రమాణ పరిచయం, ప్రశ్నోత్తరాల సమయం, బిల్లును ప్రవేశపెట్టడం, దానిని ఆమోదించడం, మరికొన్నింటిని తిరస్కరించడం వంటి వాటిని విద్యార్థులు క్రమపద్ధతిలో ప్రదర్శించారు. కేవీ రామన్, ఎంఈఓ రఘునందన్‌రావు, నవోదయ ప్రధానాచార్యులు పి.భాస్కర్‌కుమార్, అధ్యాపకులు భాస్కరాచారి పాల్గొన్నారు.